శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సీతారామపురంలో వ్యక్తి దారుణ హత్య



**సీతారామపురం నవంబర్ 27 ప్రభాతవార్త** వివాహేతర సంబంధం కారణంగా వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన శనివారం అర్ధరాత్రి సీతారామపురంలోని ఆదర్శ పాఠశాల సమీపాన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి పోరుమామిళ్లకు ఒచెందిన మహిళ అదే ప్రాంతానికి చెందిన ఒ వ్యక్తితో గత కొన్ని సంవత్సరాలుగా వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుంది. ఇద్దరి మద్య తలెత్తిన మనస్పర్ధల కారణంగా మృతుడ్ని శనివారం సీతారామపురంలోని ఆదర్శ పాఠశాల సమీపాన గల ఒ నివాసం వద్దకు పిలిపించింది. అతి కిరాతకంగా అతనిని నరికి వారి వెంట తెచ్చుకున్నస్కూటర్‌పైనే మృతదేహాన్ని ఉంచి పెట్రోల్ పోసి తగలబెట్టిన్లు నిందితురాలు కడపజిల్లా పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్‌నందు లొంగి పోయి నేరాన్ని అంగీకరించింది . సీతారామపురం పోలీసులకు సమాచారం అందిన వెంటనే ఉదయగిరి సిఐ గిరిబాబు, ఉదయగిరి ఎస్ఐ అంకమ్మ, సీతారామపురం ఎస్ఐ కిషోర్‌బాబులు ఘటనా స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి నిందితురాల్ని విచారించి హత్యకు గల పూర్తి వివరాలు తెలయజేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

## బిటెక్ విద్యార్థులపై ముసుగులు వేసుకొన్న వ్యక్తుల దాడులు



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త** బిటెక్ చదువుతున్న నలుగురు విద్యార్థులపై ఆరు మంది వ్యక్తులు మోటార్‌బైక్‌లపై ముసుగులు వేసుకొని వచ్చి దాడులు చేసిన ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీస్ యంత్రాంగానికి సవాల్‌గా మారింది. వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలావున్నాయి. కావలి పట్టణంలోని వెక్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న నలుగురు విద్యార్థులు వెంగళరావునగర్‌లోని ఓ రూమ్‌లో వుంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆరు మంది వ్యక్తులు ముసుగులు ధరించి ఈ విద్యార్థుల రూములోకి జొరబడి దాడులు చేశారు. ఈ దాడులలో బిటెక్ చదువుతున్న హుస్సేన్, కదీర్, నయీం, నరేంద్రలు కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నగోపవరంలో ఇంటింటికి భగవద్గీత




**కలువాయి నవంబర్ 27 ప్రభాతవార్త** కలువాయి హిందూధర్మ పరిరక్షణ సమితి ఆద్వర్యంలో ఇంటింటికి భగవద్గీత కార్యక్రమాన్ని మండలంలోని చిన్నగోపవరం గ్రామంలో సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని శ్రీమాతమ్మ దేవస్థానం, రామాలయం నుండి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భగవద్గీత గొప్పతనాన్ని ప్రతి కుటుంబానికి సభ్యులు తెలియజేశారు. గ్రామంలోని దాదాపు 120 కుటుంబాల వరకు భగవద్గీత గ్రంధాలు అందించారు. ఈ ప్రక్రియలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి భగవద్గీత కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో సభ్యులు మల్లికార్జున, ప్రసన్నకుమార్, జివి రమణయ్య, శ్రీనివాసు లు, జానకిరామ య్య, విశ్వ నాద్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసరాజు, మోదు శ్రీనివాసులు, డిల్లీ ఏడుకొండలు, గ్రామస్తులు పాల్గోన్నారు.

## యు-23 క్రికెట్ పోటీలలో నెల్లూరు జట్టు ఘనవిజయం



**బుచ్చి నవంబర్ 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రూరల్ రామచంద్రాపురంలో గుత్తికొండ కాలేజి మైదానంలో సూపర్ క్రికెట్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఆంధ్రప్రదేశ్ యు-23 రాష్ట్ర వ్యాప్త క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళీ పాల్గోన్నారు. చైర్‌పర్సన్ క్రికెట్ బ్యాట్‌తో కొద్దిసేపు గేమ్ ఆడి అందరని సంతోషింపచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతు ఈ పోటీలలో 13 జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గోన్నట్లు వారు తెలిపారు. క్రీడాకారులందరికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిబకనబరచిన క్రీడాకారులకు జాతీయ పోటీల ఎంపిక చేస్తామని వారు తెలిపారు. చెన్నూరు రాజేష్ చారిటబుల్ ట్రస్టు ద్వారా క్రీడాకా



రులకు బోజన వసతి ఏర్పాట్లును చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో మొదటి స్థానం నెల్లూరు యూత్, రెండోవస్థానం ప్రకాశం యూత్, మూడో స్థానం చిత్తూరు జట్టు, కైవశం చేసుకున్నారు.

ఈటోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు డిసెంబర్‌లో మద్యప్రదేశ్‌లో ఇండోర్‌లో జరగనున్న జాతీయ క్రీడలలో పాల్గోంటారని వారు తెలిపారు. విజేతలను మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అభినందించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్‌యాదవ్, రాచూరు సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీదేవి, జిల్లా సూపర్-7 క్రికెట్ అద్యక్షులు శ్రీదర్‌రెడ్డి, సెక్రటరీ గురవయ్య, పిడి బీమతాటి వెంకటరమణయ్య, ముని, వైసిపి నాయకురాలు బట్టా ప్రవల్లిక, వ్యాయామోపాధ్యాయులు పాల్గోన్నారు. గుంటూరు వెంకట్రావ్ మోమెరియల్ తరపున మెడిల్స్, మెమోంట్స్, సర్టిపికేట్స్ అందజేశారు. నిర్వాహకులు వారికి దన్యవాదాలు తెలిపారు.

## ఈ నెల 30న నాలుగో విడత జగనన్న విద్యా దీవెన ప్రారంభం



**నెల్లూరు టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త:** ఈ నెల 30వ తేదీన నాలుగో విడత జగనన్న విద్యా దీవెనను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ ఉప సంచాలకులు వై. వెంకటయ్య తెలిపారు. ఆయన జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సాంఘిక సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు శనివారం ఎన్‌పిసిఐ పెండింగులో ఉన్న వాటిని పరిశీలించామని అన్నారు. కో ఆర్డినేటింగు అధికారుల పెండింగు రెండు అంతకంటే ఎక్కువ సచివాలయాలు ఉన్నట్లయితే సంబంధిత మానిటరింగ్ అధికారులు, తమ కార్యాలయ సిబ్బంది లేదా తమ పరిధిలో ఎవరైనా వసతి గృహ సంక్షేమాధికారులను సంబంధిత సచివాలయాలకు వెళ్లి పెండింగ్ క్లియర్ చేయించి సిద్ధం చేయాలని ఆయన సూచించారు. పనిలో నిర్లక్ష్యము వహించిన వారిపై తగు శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**అల్లూరు, నవంబరు 27 ప్రభాతవార్త** అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని మోపూరు సచివాలయం వద్ద ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మెలికి లక్ష్మయ్య(40) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి వివరాల మేరకు మోపూరు యానాది కాలనీకి చెందిన లక్ష్మయ్యని మోపూరు నుండి నెల్లూరు వెళ్లే దారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం కోసం వివరాలు సేకరిస్తామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## టిడిపి నేతపై జరిగిన దాడి కేసులో నిందితుడు అరెస్టు



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 27, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని వాసవి నగర్‌లో నివాసం ఉంటున్న నెల్లూరు నగర టిడిపి ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పైన నెల్లూరు బి.వి.నగర్‌కు చెందిన గోగిరెడ్డి నాగ వెంకట రాజశేఖర్‌రెడ్డి దాడి చేసి, తన కారుతో ఢీకొట్టి గాయపరచిన సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు నగర డీఎస్పీ తెలిపారు. ఆదివారం పాత్రికేయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కేసు దర్యాప్తులో గాయపడిన శ్రీనివాసులురెడ్డి కుమారుడైన కోటంరెడ్డి ప్రసేనారెడ్డి గతంలో అతనితో ఎంబిబిఎస్ చదివేటప్పుడు గోగిరెడ్డి వెంకట రాజశేఖర్‌రెడ్డికి మధ్య కాలేజీ రోజుల నుంచి పాత వివాదాలు ఉన్నట్లు ఆ విషయం మనస్సులో పెట్టుకుని నిందితుడు రాజశేఖర్‌రెడ్డి శనివారం సాయంత్రం 5, 7 గంటలకు శ్రీనివాసులు రెడ్డి ఇంటికి వచ్చి అక్రమముగా వారి ఇంటి లోపలకి ప్రవేశించి ఇంటిలో వచ్చి అక్రమముగా వారి ఇంటి లోపలకి ప్రవేశించి, ఇంటిలో ఉన్న వ్యక్తులపై దాడి చేయడానికి ప్రయత్నించి వారంతా అతనిపై తిరగబడగా అతను ఇంటిలో నుంచి బయటకు పరుగున వచ్చి ఇంటి బయట ఉన్న తన కారుతో శ్రీనివాసులురెడ్డి ఇంటి ముందు భాగంలో గుద్ది గాయపరిచారని పేర్కొన్నారు. ఈ ఘటన అంతా సిసి కెమెరాలో రికార్డ్ అయిందన్నారు. గాయపడిన శ్రీనివాసులురెడ్డిని విచారించి, వారి స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంఘటన పూర్తిగా వారి యొక్క వ్యక్తిగత విషయాల వలన మాత్రమే జరిగినది, ఈ ఘటనలో వేరే ఇతర కారణాలు ఏమీ లేవని నిర్ధారణ జరిగిందని స్పష్టం చేశారు.

## ఘనంగా న్యాయ దినోత్సవ వేడుకలు



నెల్లూరు టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త: నెల్లూరు నగరంలోని దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సీతారామయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా రాజ్యాంగ దినోత్సవం, న్యాయ దినోత్సవం, న్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యువ న్యాయవాది, బహుజన ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య హాజరయ్యారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మరియు పోలీసు సిబ్బందితో కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యాంగం అనే అంశంపై మాట్లాడుతూ ప్రవేశిక రాజ్యాంగ మూలతత్వాన్ని సూచిస్తుందని తెలుపుతూ 1947 జనవరి 22వ తేదీన భారత రాజ్యాంగ పరిషత్తు సమావేశాల్లో నెహ్రూ ప్రతిపాదించిన లక్ష్యాల తీర్మానం ప్రాతిపదికపై ప్రవేశికన రూపొందించారు. రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న శాసనంగా ఆమోదించబడిందని పేర్కొన్నారు. పూర్తిగా భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగంగా భారత రాజ్యాంగం రూపొందిందని దీని ద్వారానే భారతదేశంలో అన్ని వ్యవస్థలు నడుస్తున్నాయన్నారు. భారతీయ పౌరులందరూ రాజ్యాంగాన్ని అభ్యసించి చట్టానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని చెప్పారు. పోలీసు శాఖ నుంచి బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల నుంచి సత్వర న్యాయం, అదేవిధంగా కృషి చేయాలని కోరారు. ఇర్ల వెంకటరమణయ్యను సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సీతారామయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కోవూరు సబ్‌డివిజన్‌లో కొనసాగుతున్న వరినాట్లు



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలో రబీ సీజన్ ప్రారంభం కావడంతో వరినాట్లు వేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. మొత్తం ఈ సబ్‌డివిజన్‌లో 70 వేల ఎకరాల్లో వరినాట్లు వేయాలని వ్యవసాయాధికారులు అంచనా వేయగా ఆదివారం నాటికి 12,500 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. ఈ నెలలో తుపాను కారణంగా అకాల వర్షాలు కురవడంతో సీజన్ ప్రారంభం కావడం కాస్త ఆలస్యం అయింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నారు పోసిన రైతులు నాట్లు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. అయితే వ్యవసాయ శాఖ అందిస్తున్న సలహాలు సూచనలను రైతాంగం ఆశించిన మేర పాటిస్తున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా నేల స్వభావాన్ని పరీక్ష చేయించుకుని రిపోర్టులో వచ్చిన నివేదిక ప్రకారం ఎరువులు వాడుకోవాలని ఒక వైపు వ్యవసాయ శాఖ సూచనలిస్తున్నా ఆశించిన మేర వాటిని రైతాంగం అమలు చేస్తున్న దాఖలాలు లేవు. ఫలితంగా వ్యవసాయ సాగు ఖర్చులు పెరిగి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటు వంటి పరిస్థితుల్లో పొలంబడి, తదితర కార్యక్రమాల ద్వారా రైతాంగానికి సాగులో, నీరు, ఎరువుల యాజమాన్యం పట్ల రైతుల్లో మరింత అవగాహన పెంచేలా వ్యవసాయ శాఖ కూడా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఈ క్రాప్ నమోదు కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ప్రస్తుత రబీ సీజన్‌లో వరినాట్లు వేసే కార్యక్రమం ప్రారంభమైందని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. ముఖ్యంగా రైతాంగం వ్యవసాయ శాఖ అందిస్తున్న సలహాలు, సూచనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా క్రిమిసంహారక మందులను రైతులు తమ ఇష్టానుసారంగా వాడడం వలన మిత్ర పురుగులు నశించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన



మోతాదులోనే వాడుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయ సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ క్రాప్ నమోదు వలన ప్రకృతి వైపరీత్యాల వలన పంటకు ఇబ్బంది జరిగితే నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు.

## కోర్టులో దొంగతనం డ్రామాగా తేలింది

నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం రాష్ట్రంలోని సంచలనం రేకెత్తించిన మంత్రి కాకాణి. గోవర్ధన్‌రెడ్డి ఫోర్జరీ కేసుకు సంబంధించిన ఫైళ్ళు కోర్టులో చోరీ కావడం, హైకోర్టుకు జిల్లా జడ్జి సి. యామిని ఇచ్చిన నివేదికతో అంతా డ్రామాగా తేలిపోయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం. వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ 2016లో ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి ఆనాటి మంత్రి సోమిరెడ్డి. చంద్రమోహన్‌రెడ్డిపై అనేక తప్పుడు ఆరోపణలు చేశాడని ఆరోపించారు. చంద్రమోహన్‌రెడ్డికి సింగపూర్, మలేషియా దేశాల్లో పలు ఇళ్ళు, బ్యాంక్ ఖాతాలు ఆ ఖాతాల్లో భారీగా నగదు ఉందంటూ కాకాణి ఆరోపించారన్నారు. అంతే కాకుండా అందుకు సంబంధించిన నకిలీ డాక్యు మెంట్లను కూడా విడుదల చేశాడన్నారు. ఫెర నిబంధనలను ఉల్లఘించి కోట్లాది రూపాయల నగదును బ్యాంకుల్లో ఉందని, దానితోపాటు రెండు పాస్‌పోర్టులు కలిగిన ఉన్నారని ఆ పాస్‌పోర్టులను కూడా విడుదల చేశాడన్నారు. చంద్రమోహన్‌రెడ్డిపై ఇంతటి భయంకరమైన ఆరోపణలు చేయడంతో తనతోపాటు రాష్ట్ర ప్రజలు కూడా నిజమేనని భ్రమపడ్డామన్నారు. దీనిపై ఆవేదనతో చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. అప్పటి ఈ జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని విచారణ చేసి చిత్తూరులో ఈ దొంగ డాక్యుమెంట్లను తయారు చేసిన వ్యక్తిని అరెస్టు చేసి ల్యాప్‌టాప్, సెల్‌పోన్లు, స్టాంపులు, సిమ్‌కార్డులు, దొంగ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకన్నారన్నారు. ఆ ముఠా ద్వారా దొంగ డాక్యుమెంట్లు చేయించిన కాకాణిపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసు విచారణకు వస్తున్న నేపధ్యంలో అనుకోకుండా ఆనాటి దోషి కాకాణి రాష్ట్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారన్నారు. బాధ్యతలు చేపట్టిన రెండోరోజే నెల్లూరు కోర్టులో దొంగతనం జరిగిందని ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, స్టాంపులు, సిమ్‌కార్డులు, రికార్డులు, దొంగలు



ఎత్తుకెళ్ళినట్లు ఇప్పటి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారని వెల్లడించారు. ఈ విషయమై అనుమానం వచ్చిన జిల్లా జడ్జి సి. యామిని విచారణ చేపట్టిందన్నారు. విచారణలో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, స్టాంపులు కోర్టులో లేవని పోలీసుస్టేషన్‌లోనే ఉన్నాయని ఆమె తేల్చారన్నారు. కోర్టులో దొంగతనం జరిగితే పోలీసులు ఫింగర్ ప్రింట్లు, పాదముద్రలు తీసుకోలేదని, డాగ్ స్క్వాడ్‌ని ఎందుకు పంపలేదని ఈ వ్యవహారంలో పోలీసుల పాత్రపై అనుమానం ఉందని, హైకోర్టుకు నివేదికను పంపడమే కాకుండా పోలసులు మీద నమ్మకం లేదని మరొక ఎజెన్సీతో విచారణ చేయించాలని హైకోర్టును యామిని కోరిందన్నారు. జిల్లా జడ్జి నేరుగా పోలీసుల మీద నివేదిక పంపిందంటే పోలీసులకు ఇంతకంటే అవమానం ఉంటుందాని డిఐజిని సూటిగా ఆనం ప్రశ్నించారు. హైకోర్టు జోక్యంతో విచారణకు ఇకనైనా డిఐజీ సహకరించాలని హితవు పలికారు. వెంటనే కాకాణి బెయిల్ రద్దు చేసి ఆయనను అరెస్టు చేసి పోలీసులు న్యాయానికి కట్టుబడి ఉండాలన్నారు. అదేవిధంగా జగ్గుభాయ్ అంతర్జాతీయ మాఫియాలో సభ్యుడుగా ఉన్న మంత్రి కాకాణి. గోవర్ధన్‌రెడ్డిని, మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశాడు. నిజాయితీగా విచారణ చేసిన జడ్జి యామినికి పాధాభివందనమని ఆయన తెలిపారు.

## అండర్-19 జిల్లా క్రీడాజట్ల ఎంపికలు

**నెల్లూరు, నవంబరు27 ప్రభాతవార్త-విద్య** నెల్లూరుజిల్లా అండర్-19 బాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్ జిల్లాస్థాయి బాల బాలికల క్రీడా జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని స్థానిక ఏసీసబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి కె. మధుబాబు, సిఐ శ్రీనివాసులరెడ్డిలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. జిల్లా జట్లకుఎంపికైన వాలీబాల్ క్రీడాకారులు విశాఖ పట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనటం జరగుతుంని అండర్-19 స్కూల్‌గేమ్స్ ఫేడరేషన్ జిల్లా కార్యదర్శి పి. వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అవగాహనతో పక్షవాతాన్ని దూరం చేయవచ్చు



**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** అవగాహనతో పక్షవాతం, మూర్ఛ వంటి వ్యాధుల్ని దరిచేరకుండా దూరం చేయవచ్చునని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ బిందు మీనన్ తెలిపారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలోని రామస్వామిపాళెం శివాలయం ఆవర ణలో ఆదివారం జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత న్యూరో మెగా వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్షవాతం ,మూర్ఛ వంటి రోగాలు వస్తున్నాయన్న సంకేతాలు వచ్చినప్పుడే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. మనిషి సాధారణ జీవితంలో తెలియకుండానే నరాలకు సంబంధించిన వ్యాధులు వస్తాయని అటువంటి పరిస్థితులలో ఆహార అలవాట్లు, దినచర్యలలో వ్యాయామం, బిపి, షుగర్ కంట్రోల్‌లో వుంచుకోవాలన్నారు. ఉచిత వైద్యశిబిరానికి విచ్చేసిన ఆమె రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడంతో పాటు శివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తల రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండూరు మంజుల, వైసిపి నేత గండూరు శ్రీనివాసులు, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్, మండల మానవ హక్కుల కమిటీ చైర్మన్ ఎస్.కె.నూరుద్దీన్, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి, వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వనాధరావుపేటలో వెలిగే వీధి దీపాలు చోరీ

**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేటలో వెలిగే ఎల్ఇడి దీపాలు ఐదు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయని గ్రామ సర్పంచ్ గండూరు మంజుల తెలిపారు. వీధి దీపాలు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులలో వున్న పంచాయతీలో ఎంతో విలువైన ఎల్ఇడి దీపాలు చోరీ చేయడం బాధాకరమని దీని వెనుక వున్న వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## వైసిపి హాయంలో ఆక్వారంగం కుదేలు



**బుచ్చి నవంబర్ 27ప్రభాతవార్త** వైసిపి పాలనలో అక్వారంగం కుదేలు అయిపోయిందని క్రాప్‌హాలిడే దిశగా పోతుందని నమామిగంగే రాష్ట్ర ప్రముక్ మిడతల రమేష్ విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆర్‌బిఆర్ హైరర్స్‌లో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు సీడు,పీడ్ ఉత్పత్తిదారుల నుండి జె టాక్స్ పేరుతో ధరలు పెంచారని విమర్శించారు. విద్యుత్ చార్జిలు 1 రూపాయి నుండి 3.50 పైసలకు పెంచారని ఆరోపించారు. మార్కెట్ ధరను ప్రభుత్వం నిర్బంధంగా నిర్ణయిస్తుందని ఆరోపించారు. ఆక్వారైతులు ఆదాయాలను పూర్తిగా కోల్పోవడంతో నెల్లూరు జిల్లాలో ఆక్వారైతులు సాగు విరామం దిశగా అడుగు వేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రైతులు వరినాట్లు వేసుకున్నారు. నీటి విడుదల చేసే కాలువలు డ్రైయిన్‌లలో పూడిక తీయని కారణంతో 70 శాతం డ్రైయిన్‌లో తూటాకు తీయని కారణంగా చివరి ఆయకట్టు రైతాంగానికి సరిపాడా నీరు అందే పరిస్థితి లేదని అన్నారు. రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. బుచ్చి నగర అధ్యక్షులు రామిశెట్టి మోహన్, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, గోళ్ళ నరసింహులు,నాగసాల తిరుపతయ్య, సందల నాగేశ్వరరావు, నీలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తబలా వాయిద్య కళాకారుడు చిన్నా మృతి



**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేటకు చెందిన తబలా వాయిద్య కళాకారుడు చిన్నబాబు(58) ఆదివారం ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. విశ్వనాధరావుపేటలోని నార్తు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం తబలా వాయిస్తూ గుండె పోటుతో మరణించడంతో పలువురు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. క్రైస్తవ సువార్త కూటములలో చిన్నబాబు సంగీత కచ్చేరిలలో పాల్గొనే వాడని అటువంటి తబలా కళాకారుడు మృతి చెందడం పట్ల పలువురు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## ఆదరణ కేంద్రంలో అనాధలకు అల్పాహారం పంపిణీ

**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో విశ్వనాధరావుపేట పంచాయతీ 6వ వార్డు మెంబర్ బొంతా సుధీర్ తల్లి బొంతా వరలక్ష్మి 2వ వర్ధంతిని పురస్కరించుకొని పేదలకు, అనాధలకు అల్పాహారం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## చలికి గజగజ

**కలిగిరి, నవంబర్27, ప్రభాతవార్త;** వాతావరణంలో మార్పులు కారణంగా మండలంలో విస్తారంగా వీదురు గాలు వీస్తున్నాయి. దీనితో సాయంత్రం 4గంటలనుండే చలి వణికిస్తుంది. వర్షాకాలం కావడం మద్య మద్యలో తుఫానులు రావడం వాతావనఅం చల్లబడడంతో చలి చంపేస్తుంది. ఇది చాలదన్నట్లు గత వారం రోజులుగా మంచు కూడా దట్టంగా కురుస్తుంది. ఈ క్రమంలో ఉదయం8గంటలవరకూ ఇళ్లనుండి బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. ఈ చలి, మంచుకు తోడు మండలంలో సీజనల్ వ్యాదులు కూడా ప్రబలుతున్నాయి. దీనితో ప్రజలు చలికి బయటకు రావడానికి సాహసించక ఇళ్లలోనే అదికమంది గడుపుతున్నారు.

## దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలు కావాలి



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగడమే కాకుండా దేశానికి ఉపయోగపడేలా మంచి శాస్త్రవేత్తలుగా తయారు కావాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. రామలింగం తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో విజ్ఞానభారతి, ఆప్కాస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 36 పాఠశాలల విద్యార్థులు క్విజ్ పోటీలకు, 72 పాఠశాలల విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేల ఇటువంటి కార్యక్రమాలు ఎవరు నిర్వహించినా విద్యార్థులు తప్పక అందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన భారతి ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయిలోని ఆణిముత్యాలను వెలికి తీసే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ కుమార్, డైరెక్టర్ సుబ్బారావు, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలకులు బాల సుబ్బారావులు పలు సూచనలు చేశారు. అనంతరం గెలుపొందిన విజేతలకు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార ్యక్రమంలో కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్ఆర్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.



## గోరుముద్దలో నాణ్యత లేదు



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పేరుతో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో రుచి, శుచి లేదని , ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే ఈ భోజనం తిని విద్యార్థులు అస్వస్థకు గురయ్యారంటే ఈ పథకం రాష్ట్రంలో ఏ విధంగా అమలవుతుందో అర్థమవుతుందని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకంలో విద్యార్థులకు రుచి, శుచి లేని భోజనాన్ని అందిస్తున్నారన్నారు. సొమ్మేమో కేంద్రానిది, పేరు మాత్రం జగన్‌మోహన్‌రెడ్డిది. పేరు పెట్టుకోవడంలో ఉన్న శ్రద్ధ పిల్లలకు భోజనం పెట్టడంలో లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మొట్టమొదలుగా ఎన్టీఆర్ రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని ప్రవేశపెడితే కేంద్ర ప్రభుత్వం 1995 నుంచి దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఈ భోజనం తిని విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారనే వార్తలు పత్రికలో నిత్యం చూస్తున్నామన్నారు. చివరకు అధికార పార్టీ శాసనసభ్యులు కూడా నాసిరకం భోజనం పెడుతున్నారని విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ఏదో కొత్తగా ప్రవేశపెడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే చెబుతున్నారని, వాస్తవంగా ఈ పథకం కేంద్రం నిధులతో అమలవుతుందని, కేవలం ప్రభుత్వ అసమర్థత వలన విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకాన్ని అందిస్తే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని నిలపివేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వసతి గృహంలో సైతం 2018 నుంచి మెస్ చార్జీలు పెంచకపోవడంతో హాస్టల్ విద్యార్థులు కూడా కడుపునిండా భోజనం చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సత్యనారాయణరెడ్డి, పరంధామయ్య, గోపాల్, విజయ్, మల్లి, నిరంజన్‌బాబురెడ్డి, సుబ్బయ్య, మోహన్‌కృష్ణ, లక్ష్మయ్య, ఉస్మాన్, ఖలీల్ , సూర్యలు ఉన్నారు.

## కాచి చల్లార్చిన నీటినే తాగాలి



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రస్తుత సీజన్‌లో మంచినీటిని కాచి చల్లార్చుకుని తాగాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ దిలీప్ తెలిపారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహ సముదాయంలో విద్యార్థినులకు పలు ఆరోగ్య పర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమాధికారులు వసతి గృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. సంక్షేమాధికారులు పద్మ, మేరీ సుప్రజ, సునీత, సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## కొసాగుతున్న అయ్యప్పల ఉచిత భోజనం



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరులోని గ్రామ దేవత నాగవరపమ్మ దేవస్థానంలో హరిహర పుత్ర సమాజం ఆధ్వర్యంలో అయ్యప్పదీక్ష పూనిన వారందరికీ డిసెండర్ 16వ తేది వరకు ఉచిత అన్న ప్రసాద కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు నిర్వాహకులు, దాత సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగించేలా ప్రత్యేక ప్రాణాళికలు రూపొందించారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ఉభయ కర్తగా కోవూరుకు చెందిన న్యాయవాది పి. సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అంతకు ముందు అయ్యప్పకు రుత్వికులు శేఖర్ స్వామి, నిర్వాహకులు మల్లికార్జున్‌రెడ్డి స్వాములు ప్రత్యేక పూజలు చేపట్టారు.

## విజేతలకు బహుమతులు పంపిణీ




**నెల్లూరు టౌన్, నవంబరు 27, ప్రభాత వార్త:** 1949వ సంవత్సరం నవంబరు నెల 26వ తేదీన రాజ్యాం గసభలో ఆమోదించబడి, శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు, మేము సమర్పిం చుకుంటున్నాం భారతీయులకు రాజ్యాంగం అంత గొప్పదని వివేకానంద సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన సాయికుమార్ రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర మరియు పినాకిని యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, ప్రభాకర్, పినాకిని యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు, హనుమాన్, స్థానికులు పాల్గొన్నారు.

## మహిళల వస్త్రదారణపై వ్యాఖ్యలు చేసిన గరికపాటి, రామ్‌దేవ్‌బాబా క్షమాపణలు చెప్పాలి




**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త** మహిళల వస్త్రదారణపై నోటికొచ్చినట్లు మాట్లాడిన గరికపాటి నరసింహారావు, స్వామి రామ్‌దేవ్‌బాబాలు మహిళా లోకానికి వెంటనే క్షమాపణ చెప్పాలని కావలి ఉమెన్ ఫోర్స్ మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలకొండ శారద, అధ్యక్షురాలు ఎస్.ప్రభావతి, కార్యదర్శి జి.అమరజ్యోతి, ఉపాధ్యక్షురాలు యం.అరుణ, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే గరికపాటి, పతంజలి వ్యాపారి రామ్‌దేవ్‌బాబాలు మహిళల వస్త్రదారణలపై విచ్చలవిడిగా ఆక్షేపణలు చేయడం మహిళా లోకాన్ని కించపర్చడమేనన్నారు. సమాజానికి హితవు చెప్పే ప్రసంగాలు ఎన్ని చేసుకున్నా వీళ్లను అభ్యుదయవాద పురుషులు, మహిళలు పట్టించుకోరన్నారు. చెప్పేవాడికి వినేవాడు అలుసు అన్నట్లుగా ఒక స్థాయిలో వున్నాం, మాకేమి అనే అహంకారంతో ఏది చెప్పినా చెల్లుతుందని అనుకుంటున్నారేమో హెచ్చరించారు. మహిళలు చీరలు కట్టుకోక చుడిదార్లు వేసుకుంటున్నారని చీరలు కట్టినా, చుడిదార్లు వేసుకోకున్నా ఇవేమి ధరించకున్నా కూడా తనకళ్ళకు స్త్రీలు అందంగా వుంటారని వ్యాఖ్యానించడం మహిళలను కించపర్చడమేనన్నారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని ఐద్వా వంటి మహిళా సంఘాలతో పాటు ఎంతో మంది డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేస్తున్నారని వారు తెలిపారు. ఎల్‌కేజి పాపల నుంచి ముసిలి వయసు వారి దాకా లైంగిక దాడులకు గురవుతూ అభద్రతతో గడుపుతుంటే ప్రవచనాలు చెప్పే స్వాములు మహిళలను కించపరుస్తూ మాట్లాడటం మృగాళ్ల దాడులను పేరేపించడమేనని దుయ్యబట్టారు. వీరిద్దరు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అంతర్జాతీయ స్థాయిలో పథకం సాదించిన విధ్యార్ధినికి ఆత్మీయ సన్మానం



**కలిగిరి, నవంబర్27, ప్రభాతవార్త;**దేశం ఎల్లలు దాటి అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడమే కాకుండా అంతర్జాతీయ స్తాయిలో పథకం సాదించిన విద్యార్ధినికి సొతగ్రామంలో ఆత్మీయ సత్మాన కార్యక్రమం జరిగింది. కలిగిరి మండలంలోని పడమర గుడ్లదొనలో సుష్మ అనే విద్యార్ధినికి ఆదివారం గ్రామస్తులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రు సమక్షంలోఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పడమరగుడ్లదొన కుచెందిన చిట్టేటి శ్రీనివాసులు,సుమలత కుమార్తె సుష్మ. సుష్మ ప్రస్తుతం కలిగిరిలోని కస్తూరిబా గాంధీబాలికల పాఠశాలలో 9వ తరగతి యదువుతుంది. చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవడంతో పాఠశాల పిఇటి స్పందన ప్రోత్సాహంతో పోటీలలో పాల్గొంటుంది. ఈక్రమంలోజంప్ రోప్ అథ్లెంటెక్స్ పోటీలలో సుష్మ ప్రతిభ కనపరచింది. జంప్‌రోప్ పెడరేషన్ కప్2022పోటీలు జాతీయ స్థాయిలో కర్నాటక రాష్ట్రంహౌస్‌పేట్‌లో ఈఏడాది ఆగష్టుల జరుగగా ఈ పోటీల్లో 3నిమిషాల్లో జంప్‌రోప్ విబాగంలో బంగారు పథకంసాదించింది. 6న120సెకండ్ల లాంగ్‌రోప్ పోటీలలో వెండి పథకం సాదించింది. దీనితో అంతర్కాజతీయ పోటీలలో ఎంపికై థాయిలాండ్ దేశంలోజరిగిన రోప్‌జంప్ పోటీలలో మన దేశంనుండి సుష్మ పాల్గొనడమే కాకుండా మూడు నిమిషాల ఎండూరెన్స్ విబాగంలో అంతర్జాతీయ స్తాయిలో ద్వితీయ స్తానం సాదించి దేశంతరపున రజిత పథకం సాదించింది సుష్మ. ఈ పథకం సాదించడంపట్ల ఆమెతల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్త పరిచారు. ఈక్రమంలో ఆదివారంపథకాలు సాదించిన విధ్యార్ధినికి గ్రామంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## మరుగున పడ్డ మరుగుదొడ్లు



**ఉదయగిరి నవంబర్ 27 ప్రభాతవార్త** ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో గల ఉదయగిరి పంచాయితీ మరుగుదొడ్లు ప్రజలకు ఉపయోగకరంగా లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు వివిధ పనుల మీద చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చే ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగించుకోవాడానికి వీలులేక నానా అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు నేర్మించారా గాని వాటిని వినియోగంలోనికి తీసుకోనిరావడం అధికారులు విస్మరించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంగ్రా మహిళలు ప్రయాణికులు, బస్టాండ్‌లో ఉండే మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడం వల్ల తమ అవస్థలు వర్ణాతీతంగా ఉందని అధికారులు ఇకనైనా స్పందించి మరుగుదొడ్లను ఉపయోగించుకునే విధంగా చేయాలని కోరుతున్నారు. ఎన్నిసార్లు ఎవ్వరు చెప్పినా ఉదయగిరి పంచాయితీ వారులో స్పందన లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## పురపాలక ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి దినోత్సవం



**కావలి రూరల్, నవంబరు 27 ప్రభాతవార్త** కావలి పాతవూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవం ఎన్‌సిసి కేర్‌టేకర్ తిప్పారెడ్డి కొండారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత బ్యాంక్ ఆడిట్ చీఫ్ మేనేజర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ఎన్‌సిసి క్యాడెట్స్ ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు నానాటికి మానవత్వం కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులను శ్రద్దగా చూసుకోవాలని తెలిపారు. ఎన్‌సిసి ద్వారా దేశభక్తి పెరుగుతుందన్నారు. ఎన్‌సిసి కేర్‌టేకర్ తిప్పారెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ ఎన్‌సిసి మొదటి యూనిట్ ఆదివారం ఢిల్లీలో జరిగిందని, 1948 సంవత్సరంలో ఎన్‌సిసిని ప్రారంభించిన సందర్బంగా ఆదివారం 74వ వార్షికోత్సవంను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎన్‌సిసి ద్వారా క్రమశిక్షణ, ఐక్యమత్యం అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం ఎన్‌సిసి క్యాడెట్స్ ర్యాలీ నిర్వహించి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు పణిరాజ్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## నటశేఖరుడికి ఘన నివాళి



**వింజమూరు, నవంబర్27ప్రభాతవార్త:** సినీ రంగంలో నటశేఖరుడు సూపర్‌స్టార్ కృష్ణకు ఆదివారం అభిమాన సంఘ నాయకులు కృష్ణ దశదినం సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. వింజమూరులోని శ్రీరాఘవేంద్ర హైరర్స్ దగ్గర కృష్ణ అభిమానులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ముందుగా నివాళులర్పించారు. ఈసందర్భంగా అభిమాన సంఘనాయకులు కొండా వెంకటేశ్వర్లు, వి.కోటేశ్వరరావ్ , కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ సురేష్‌లు మాట్లాడుతూ సినీ వినీలాకాశంలో సూపర్‌స్టార్‌గా కృష్ణ గొప్ప నటుడిగా సినీ రంగంలోనే ఎంతో ధైర్యసాహసంగా సినిమాలు నిర్మించిన గొప్ప నటుడన్నారు. కృష్ణ మొట్టమొదటగా కలర్ సినిమాలను, సినిమాస్కోప్ చిత్రాలను తీసి సినీ రంగంలోనే డేరింగ్, డాషింగ్ హీరోగా పేరొందాడన్నారు. చిత్ర రంగంలో ఆయనకు ఆయనే సాటిగా నిలిచాడన్నారు. సినీరంగ కార్మికులను కూడా సమానంగా చూస్తూ వారి హృదయాల్లో కూడా గొప్ప నటుడిగా నిలిచాడన్నారు. ఆయన ఈనెల 17న మృతిచెందడం అభిమానులకు తీరని లోటు అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో రమేష్, కరకల కొండారెడ్డి, బ్యాంక్ శ్రీనివాసులు, ఎస్.మల్లిఖార్జున, పి.మల్లిఖార్జున , పి.హేమాద్రి, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, సోమిశెట్టి వెంకటశేషారావ్, కె.వి.సుబ్బయ్య, జి.వి.ప్రభాకర్, గూడా నరసారెడ్డి, సందానిబాషా పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం

**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాసుపత్రిలో ఎన్‌సిసి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతోమంది నిరుపేదలు వస్తారన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ఇబ్బంది పడుతున్నారని ఈ విషయాన్ని అర్థం చేసుకుని రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ కల్నల్ సునీల్‌కుమార్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ ఎం.వీరభద్రరావులు పాల్గొన్నారు.

## బాగా చదవండి ఉన్నత శిఖరాలు అధిరోహించండి



**బుచ్చి నవంబర్ 27 ప్రభాతవార్త** ప్రభుత్వం హాస్టల్స్ ద్వారా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ప్రతి విద్యార్థి బాగా చదవాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని బిసి బాలురహాస్టల్-1 హాస్టల్-2 లవిద్యార్థులకు దుప్పట్లు,కార్పెట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె వారితో కొద్ది సేపు ముచ్చటించారు. హాస్టల్‌లో మెను ఏలా ఉందనిఆమె ప్రశ్నించగా ఉదయం రోజకొక టిపిన్ పెడుతున్నారని విద్యార్థులు ఆమె తెలిపారు. హాస్టల్ అంతా పరిశీలించిన ఆమె వార్డన్లను అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాస్టల్ విద్యార్థులకు అద్భుతమైన మెను ఏర్పాటు చేశారని విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె కోరారు. సంక్షేమాధికార్లు దయాకర్,రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మాయిలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు



**బుచ్చి నవంబర్ 27 ప్రభాతవార్త** ప్రస్తుతం చదువులలో,ఉద్యోగాలలో,క్రీడలలో అన్ని రంగాలలో అమ్మాయిలు అద్భుతంగా రాణిస్తున్నారని బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రశంసించారు. బుచ్చిరెడ్డిపాలెం నగరపాలక పంచాయితీలోని బిసి బాలికల వసతి గృహంలో అమ్మాయిలకు దుప్పట్లు,కార్పెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అమ్మాయిలతో ముచ్చటించారు. జగనన్న అద్భుతమైన పాలనలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో హాస్టల్ విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మ్యాట్రిన్ ఎ.వి.ఎస్ లక్ష్మీ చైర్‌పర్సన్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకురాలు బట్టా ప్రవల్లిక,దళితనాయకులు భీమతాటి వెంకటరమణయ్య ఉన్నారు,

## వివాదాలు జరగకుండా అధికారులు స్పందించాలి



**ఉదయగిరి నవంబర్ 27 ప్రభాతవార్త** ఉదయగిరి పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ఉదయగిరి మండలం బిజ్జంపల్లి గ్రామానికి చెందిన 11 మంది ముస్లింలకు 2003లో ప్రభుత్వం 13.75 సెంట్ల భూమిని వ్యవసాయ భూమిగా వారికి ఇచ్చిందని తెలిపారు. కాని ఇప్పుడు లింగనాపల్లి గ్రామానికి చెందిన వారికిఆభూమిని స్మశానం కొరకు కేటాయించడం అందుకు అణుగుణంగా చదును చేయడం భూమి హక్కు దారులైన ముస్లింలను భయభ్రాంతులకు గురి చేసినట్లు అవుతుందని వారు తెలిపారు. గత ప్రభుత్వం అప్పటి తహసిల్దారు అర్హులైన వారికి భూమిని కేటాయించక ఆభూమి వారికి అర్హత లేదని వేరొవారికి ఆ భూమిని అప్పగించడం రెండు గ్రామాల మధ్య వివాదానికి దారి తీసే విధంగా ఉందని దీనిని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామాలలో వివాదాలు జరగకుండా సామరస్యంగా చర్చిలు జరిపి ఇరువర్గాలకు తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ నాయకులు పర్దిన్‌భాషా,గ్రామస్తులు పాల్గొన్నారు.

## సంయుక్త సేవా సంస్థ సేవలు ప్రశంసనీయం



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవలు ఎంతైనా ప్రశంసనీయమని నెల్లూరు డాక్టర్ జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ కన్వీనర్ కావయ్య తెలిపారు. ఆదివారం సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరానికి డాక్టర్ శేషారెడ్డి ట్రస్ట్ ఎప్పుడు అండగా వుంటుందన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి 4వ ఆదివారం ఈ పాఠశాల ఆవరణలో నిర్వహించే వైద్య శిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో ఐయంఎ గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, కావలి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ కామంచి సుబ్బారావు, డాక్టర్ సుధీర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ ఎ.ఉమాచంద్, డాక్టర్ పి.శివప్రసాద్‌లు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. షుగర్ టెస్ట్, బిపి, రెడ్‌క్రాస్ సహకారంతో బ్లడ్ గ్రూప్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, యం.అజిత్‌బాబు, ఎన్.శివప్రసాద్‌రెడ్డి, యం.చంద్రశేఖర్,పి.జానకిరాం, జి.కళ్యాణి, ఎ.రమణయ్య, బుర్లా రఘుకుమార్‌రెడ్డి, యం.వి.యన్.ప్రసాదరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిపై దాడిని ఖండించిన ధర్మవరం.సుబ్బారావు

**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్యని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మవరం.సుబ్బారావు అన్నారు. ఆదివారం నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో ఉన్న అపోలో ఆసుపత్రిలో దాడికి గురై వైద్యం పొందుతున్న కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిని చూసి పరామర్శించేందుకు ఉదయం 10గంటలకు ధర్మవరం.సుబ్బారావు, యువ నాయకుడు ధర్మవరం.గణేష్‌కుమార్‌లు అపోలో ఆసు పత్రికి వెళ్ళారు. కోటంరెడ్డి కుమారుడైన ప్రజాసేనరెడ్డిని శ్రీనివాసులురెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. ఏదైనా అవసరం అయితే తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు ప్రజాసేనరెడ్డికి తెలిపారు. ఆయన త్వరగా కోలుకుని యధావిధిగా ప్రజా సేవ చేసేందుకు రావాలని వారు ఆ భగవంతుడిని వేడుకున్నారు.

## స్వర్ణయంత్రానికి వితరణ



**కందుకూరు నవంబర్ 28, ప్రభాతవార్త** పట్టణంలోని శ్రీ అంకమ్మతల్లి దేవాలయ పునర్నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పిలుపుమేరకు దాతలు భక్తులు వివరివిగా స్పందిస్తూనే ఉన్నారు. శ్రీ అంకమ్మతల్లి పాదాల చెంత ప్రతిష్ఠింపచేసే స్వర్ణయంత్రానికి గుర్రంవారిపాలెంకు చెందిన తానికొండ వంశానికి చెందిని మూడు తరాల వారు నాలుగు గ్రాముల బంగారానికి నగదు రూపంలో అందచేశారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులకు ఈమేరకు అందచేశారు. ఈ కార్యక్రమంలో తానికొండ కోటయ్య ధర్మపత్ని వెంకటలక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి మునిమనుమడు సురేంద్ర రూ.5,116లు, తానికొండ సుబ్బారావు ధర్మపత్ని శేషమ్మ రూ.5,116లు,తానికొండ రవి ధర్మపత్ని పద్మ రూ.5,116లును విరాళంగా కమిటీ సభ్యులు ఆవుల మాధవరావు,మాదాల మాల్యాద్రిలకు అందచేశారు.

## భారీ జనసందోహం మధ్య ట్రస్ ప్రారంభోత్సవ సన్నాహాలు



**వింజమూరు,నవంబర్27ప్రభాతవార్త:**వింజమూరు మండల కేంద్రంగా బొమ్మరాజు చెరువు వద్ద డిసెంబరు 14న భారీ జనసందోహం మధ్య కానున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవానికి ట్రస్ట్ చైర్మెన్ కాకర్ల సురేష్ భారీ జన సమీకరణలో నిమగ్నమయ్యారు. వింజమూరు పట్టణంలో కొద్దిరోజులుగా ఉంటూ ట్రస్ట్ ప్రారంభోత్సవానికి ముమ్మర ప్రయత్నాలను మొదలెట్టారు. అత్యంత నిరాడంబరంగా రాజకీయ నేతలను , ఉపాధ్యాయులను, ఉద్యోగులను, గ్రామ పెద్దలను కలుస్తూ ట్రస్ట్ ద్వారా అందించే సేవలను వివరిస్తూ ట్రస్ట్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. అందులో భాగంగా ఆదివారం మండలంలోని చంద్రపడియలో పర్యటించి పలువురు నేతలను కలిసి ఆహ్వానించారు. కాగా ట్రస్ట్ పేరుతో నియోజకవర్గంలోకి ప్రవేశించి అనంతరం రాజకీయ అరంగేట్రం చేసేందుకు కాకర్ల ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొద్దిరోజులుగా గ్రామ గ్రామాన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో టిడిపి టిక్కెట్టును ఆశిస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నర సమయం ఉండడంతో ఉదయగిరి నియోజకవర్గంలో కాకర్ల క్యాంటీన్‌లు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల్లోకి వెళ్ళాలని కాకర్ల భావిస్తున్నట్లు సమాచారం. ప్రధాన రాజకీయ పార్టీల్లోని అసమ్మతి నేతలను కలుస్తూ వారి సూచనలు, సలహాలను తీసుకుంటూ చాపకిందనీరులా తన రాజకీయ అరంగేట్రంకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాడు. ఇటీవల కాలంలో విరివిగా విరాళాలు ఇస్తూ ప్రచారంలో నిలిచాడు.

## విటమిన్లతో ఎముకల పటుత్వం



**చేజర్ల, నవంబర్ 27 ప్రభాతవార్త:** ఎముకలు పటిష్ఠంగా ఉండాలంటే విటమిన్లతో కూడిన ఆహారపదార్థాలు మరియు స్వతహాగా సూర్యరశ్మిద్వారా డి విటమిన్ పొందడం తప్పనిసరి అని ప్రవీణ్ ఆర్థో హాస్పెటల్ డాక్టర్ రేణంగి ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం చేజర్ల లోని సాయి కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో 45సంవత్సరాలు వయసు దాటిన తర్వాత ఎముకల్లో పటుత్వం తగ్గే ప్రమాదం ఉంద న్నారు. గర్భాశయ ఆపరేషన్లు చేయించుకోవడం వలన వారిలో ఏమేరకు ఎముకల్లో పటుత్వం ఉంది , వారికి విటమిన్లు ఏమేరకు అవసరమవుతాయన్న విషయంపై ఈవైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో సాధారణంగా చిన్నపాటి నొప్పులను లెక్కచేయకుండా పనులకు వెళుతుంటారని వాటిని సకాలంలో వైద్యుని వద్ద చూపిస్తే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. శిబిరానికి హాజరైన రోగులకు బిపి, షుగర్, ఎముకల పటుత్వ పరిక్షలను నిర్వహించామన్నారు. జ్ఞానమొర్రి సమస్యలున్నవారికి కూడా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. సొంతమండలంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకోసం ఈవైద్యశిబిరం నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి రోగులకు మందులు అందజేస్తామన్నారు. చేజర్ల మండల వైసిపి కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో చేజర్ల ఉప సర్పంచ్ ఉడతా పుల్లయ్య, వంగవరగు ఆనందరెడ్డి, ప్రవీణ్ ఆర్థోపెడిక్ హాస్పెటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రజకులు రక్షణ చట్టం ఏర్పాటు చేయండి




**నెల్లూరు టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త:** రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరు నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం మినీ హాలులో రజకుల ఆత్మీయ జిల్లా సదస్సు నేరెళ్ల శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రజకులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, గ్రామ బహిష్కరణలు తదితర సంఘటనలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రజకుల భద్రత కొరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా సామాజిక రక్షణ చట్టం రజకుల కోసం ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న ఎన్నికల్లో రజకులను చైతన్యవంతులు చేసి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. రజక కుటుంబాల్లో ఉన్న యువతీ యువకులకు ఉపాధి కల్పించే విధంగా రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి కల్పిస్తూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని ఆయన కోరారు. అనంతరం డాక్టర్ తిరుపాల్ మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కరించాలని, సంఘాల నాయకులందరూ కలిసి ఐక్యంగా పని చేయాలని రజకులు సేవా దృక్పథంతో వృత్తి చేస్తున్న వృత్తిదారులు అనేక సామాజిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వృత్తిదారుల కోసం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నేతలు పని చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ సదస్సులో రజక సంఘాల నాయకులు పాతపాటి రాధాకృష్ణ, గంధం అంకయ్య, ఆములూరు వెంకటేశ్వర్లు, వృత్తి సంఘాల నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, గుంజి దయాకర్, రజక వృత్తిదారుల సంఘం నాయకులు రేకులగుంట అంకయ్య, నేరెళ్ల శ్రీనివాసులు, బొప్పరాజు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మదేవి వేదవతమ్మ, దేవరకొండ వెంకటేశ్వర్లు, వందేటి సురేంద్ర, కోమటిగుంట్ల కృష్ణ, పొట్టిపాళెం ప్రభాకర్, ఎన్.వి.రమణయ్య, తదితర నేతలు రజకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షులుగా పొట్టేపాలెం చంద్రమౌళి, అధ్యక్షులుగా నేరెళ్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రేకులగుంట అంకయ్య, ఉపాధ్యక్షులుగా పందేటి సురేంద్ర, బ్రహ్మదేవి వేదవతమ్మ, సహాయ కార్యదర్శిగా బొప్పరాజు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారులుగా డి.వెంకటేశ్వర్లు, మరో 19 మంది కమిటీ సభ్యులతో 26 మందితో ఏకగ్రీవంగా జిల్లా కమిటీ ఎన్నిక జరిగినట్లు ప్రకటించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



**గుడ్లూరు, నవంబరు 27, ప్రభాతవార్త** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరుమృతిచెందిన ఘటన గూడూరు మండలంలో ఆదివారం జరిగింది. మండలంలోని మోచర్ల, వీరేపల్లి గ్రామాల మధ్యన గల హైవే మీద ద్విచక్ర వాహనంపై ఒంగోలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తుండగా వెనుక వైపు నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటన స్థలంలోనే ఒకరు మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం కావాలి హాస్పిటల్‌కు తరలించారు. ఈ వ్యక్తుల సమాచారం తెలియరాలేదు. వీరి సమాచారం ఎవరికైనా తెలిస్తే గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని ఎస్సై తెలియజేశారు.

## పోకూరులో సినీ నటుడు కృష్ణకు నివాళి

**వలేటివారిపాలెం నవంబర్ 28, ప్రభాతవార్త** మండలంలోని పోకూరు సినీనటుడు దివంగత గట్టమనేని కృష్ణకు దశదిన కర్మ సందర్భంగా ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. సినిమా హాల్ వద్ద కృష్ణా ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఘట్టమనేని లక్ష్మినరసింహం, దేవదారి బాబురావు,బడేవారిపాలెం మాజీ ఎంపీటీసీ పొడపాటి నరసింహం, మాధవశర్మ, సర్పంచ్ కనకరత్నం మాజీ సర్పంచ్ గట్టమనేని వెంకటేశ్వర్లు, సీతయ్య తదితరులు దివంగత కృష్ణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డికి పిఆర్‌టియూ మద్దతు



**నెల్లూరు, నవంబరు27 ప్రభాతవార్త-విద్య** వైకాపా పార్టీ తూర్పురాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డికి గుర్తింపు కలిగిన ఉపాధ్యాయ సంఘం పిఆర్‌టియూ వారి సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఆదివారం నగరంలోని స్థానిక కిలారి తిరుపతినాయుడు కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో పిఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షులు మిట్ట కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతు వివాధ రహితుడు,మృదుస్వభావి అయిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తమ యూనియన్ తరపున మద్దతు ఇస్తున్నామన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్‌లో ఉపాధ్యాయ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి తనకే పిఆర్‌టియూ మద్దతు ఉందని ప్రకటించుకోవాడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ సంపూర్ణ మద్దతు వైకాపా అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికే ఉంటుందని స్పష్టంచేశారు. యూనియన్ సభ్యులు దీనిని గమనించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు తనకు పిఆర్‌టియూ మద్దతు ప్రకటించటం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థులు చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నేటి శ్యాం ప్రసాద్‌రెడ్డిలకు పిఆర్‌టియూ నాయకులు పుష్పగుచ్ఛాలు అంధించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, జిల్లా అధ్యక్షులు వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్.తిరుపతయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి




**నెల్లూరు, నవంబరు27 ప్రభాతవార్త-విద్య** ఆవాజ్ ఆవిర్భావదినత్సోవాన్ని పురస్కరించుకుని ఈనెల29న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయ్యాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని స్థానిక సిపిఎం జిల్లా ప్రధానకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2002 నవంబరు 29న ఆవాజ్ ఆవిర్భవించిందన్నారు. అప్పటినుండి లౌకికతత్వం, భద్రత, అభివృద్ధి లకోసం పోరాటాలు చేయటం జరిగిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మైనారిటీల హక్కులకోసం అనేక పోరాటాలుచేసి విజయం సాధించటం జరిగిందన్నారు. అవాజ్ ఆవిర్భావం సందర్భంగా 29న నగరంలోని స్థానిక పూలే విగ్రహం వద్ద గల సిఐటియూ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయన్నామని అందరూ పాల్గొని విజయ వంతం చేయ్యాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రఫీ, నగర కార్యదర్శి రియాజ్, ఎస్ఎం భాష, గౌస్ పీర్, షేక్.ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తోపుదుర్తిని వెంటనే అరెస్ట్ చేయాలి..
## నారా లోకేష్‌కి జెడ్‌ప్లస్ కేటగిరి భద్రత ఇవ్వాలి



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త** వైసిపి నేత తోపుదుర్తి చేసిన దారుణ వ్యాఖ్యలపై సుమోటో క్రింద పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హత్యా రాజకీయాల్ని తలపిస్తోందని ఆమె దుయ్యబట్టారు. నారా లోకేష్ పాదయాత్ర ప్రకటన వైసిపి నేతల గుండెల్లో గుబులు పుట్టిస్తోందని తెలిపారు. వైసిపి హత్యా రాజకీయాల పార్టీ అని తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యలతో మరోసారి శవ రాజకీయాలు, హత్యా రాజకీయాలు వైసిపి పుట్టుకలోనే వున్నాయన్నారు. నారా లోకేష్‌ని చూసి వైసిపి గజగజ వణుకుతోందన్నారు. పరిటాల రవి హత్య వెనుక వైఎస్ జగన్ హస్తం వుందని తోపుదుర్తి వ్యాఖ్యలతో స్పష్టమైందన్నారు. మద్దెలచెరువు సూరి, మొద్దు శ్రీను లను సైతం హత్య చేయించింది ఎవరో తోపుదుర్తి వ్యాఖ్యలతో యావత్ తెలుగు ప్రజానీకానికి అర్థమైందని తెలి పారు. వైఎస్ ఫ్యామిలీలో నాయకులు తమ స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఆయన వ్యా ఖ్యలే నిదర్శనమన్నారు. నారా లోకేష్ మా టార్గెట్ అన్న తోపుదుర్తి వ్యాఖ్యలపై అనంతపురం ఎస్పీ వెంటనే స్పందించి సుమోటో క్రింద అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. చంద్రబాబు సభలకు వస్తున్న జనప్రభంజనం, యువతలో లోకేష్‌కు పెరుగుతున్న ఆదరణ వైసిపి నేతలకు కంటి మీద కునుకులేకుండా చేస్తుందని ఆమె తెలిపారు. లోకేష్ పాదయాత్ర చేపడుతున్న తరుణంలో తోపుదుర్తి ఈ వ్యాఖ్యలు చేశాడంటే పాదయాత్ర ప్రకటన వారిని ఎంత భయానికి గురి చేసిందో అర్థమవుతుందన్నారు. లోకేష్ ఒక వ్యక్తి కాదని శక్తి అని వైసిపి నేతలు తెలుసుకోవాలని శ్రీదేవి చౌదరి తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. లోకేష్ గురించి మరోసారి నోరుజారితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరికలు చేశారు. లోకేష్‌కు హాని తలపెట్టాలని వైసిపిలో ఏ పాటి నాయకుడైనా ఆలోచన వచ్చినా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైసిపి నేతల అంతు తేలుస్తారన్నారు. లోకేష్‌కు జెడ్‌ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

## విద్యుత్ స్తంభాలతో పొంచి వున్న ప్రమాదం



**కలువాయి నవంబర్ 27 ప్రభాతవార్త** కలువాయి మండలంలోని చిన్నగోపవరం నుండి హరిజనవాడ కెసి గోపవరం పోయే ప్రధాన రహదారిలో ప్రాథమిక పాఠశాల గ్రామ సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్‌స్తంభాలు తుప్పుపట్టిసిమెంట్ పెచ్చులు ఊడిపోయి ప్రమాదం సంభవించేందు కు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి నిత్యంఆమార్గం వెంబడి పాద చారులు వాహనదారులు, మూగజీవాలు సైతం వస్తు పో తుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా విద్యుత్‌స్తంభాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆప్రాంత వాసు లు భయభ్రాంతులకు గురౌతున్నారు. ఇటీవల కాలంలో ప్రక్కనే వున్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌కి ఎటువంటి భద్రతా లేకపోవడంతో గేదె విద్యుత్ షాకుకు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. త్వరితగతిన సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే సిది లావస్తులో ఉన్న వి ద్యుత్ స్తంభాలు తొల గించి నూతన స్తంభా లు ఏర్పాటు చేయా లని గ్రామ స్తులు కోరుతున్నారు.

### నేడు మండల సర్వసభ్యసమావేశం

**విడవలూరు నవంబర్ 27 ప్రభా తవార్త** విడవలూరు మండల సర్వస భ్య సమావేశం సోమ వారం ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యా లయంలో జరుగు తుందని ఇఒపిఆర్‌డి దశరథరామిరెడ్డి తెలిపారు. ఈ సమా వేశంలో మండలంలోని 15 పంచాయితీలకు సంబంధించిన పలు సమస్యలు చర్చిస్తారని ఆయన చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

